www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 4 సెప్టెంబర్ 2024
5
అన్నమయ్య



ప్రాంగణ ఎంపికల్లో 10 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం బీటెక్ నాలుగో సంవత్సరం చదువు తున్న విద్యార్థులకు టీపీపీ అకాడమీ బెంగళూరు వారిచే ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ ఎంపికలో కళాశాలకు చెందిన 10 విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరికి సంవత్సరానికి కనిష్ఠంగా రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు ప్యాకేజీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా ఆయన వీరిని అభినందిస్తూ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సతీష్ బాబు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ మనోజ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ రామలింగారెడ్డి

ఒప్పంద జిఒలు విడుదల చేయాలి

- డిఎంహెచ్ఒకు ఆశాల వినతిపత్రం సమర్పణ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఆశా వర్కర్లకు ఒప్పంద జిఒ సర్క్యులర్లు విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. మంగళవారం వాల్మీకి వీధిలోని పిహెచ్సిలో ఆశా వర్కర్లతో కలిసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్యకు డిమాండ్స్తో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో ఆశా వర్కర్లు తమ సమస్యల మీద సమ్మె చేయగా అప్పటి వైసిపి ప్రభుత్వం సిఐటియు నాయకత్వంతో వైద్య కుటుంబ సంక్షేమ శాఖా అధికారులను పంపి చర్చలు జరిపి కొన్ని డిమాండ్స్ మెరుగైన లీవులు వేతనాలు పెంపుదల అమలు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. చనిపోయిన వారికి మట్టి ఖర్చులు, వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగ అవకాశం, 60 సంవత్సరాలు నిండిన ఆశా రిటైర్మెంట్ జిఒ, జాబ్ చార్ట్లో లేని అదనపు పనులు చేయించరాదని కోరారు. రికార్డులు ప్రభుత్వమే చెల్లించే విధంగా వాగ్దానాలు జిఒలు సర్క్యులర్ రూపంలో ఇచ్చి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాలపై పనిభారం తగ్గించి న్యాయమైన సెల్ ఫోన్లను ఇవ్వాలని పేర్కొన్నారు. చర్చలు జరిపిన సందర్భంగా (గ్రూప్ ఆఫ్ మినిస్టర్) కాఫీ ఇవ్వాలని కోరారు. ఒక గంట అనుమతి కూడా ఇవ్వని వైనం ఆశాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యధికమైన ఆశాలను తొలగించి కొత్త వారిని నియమించే పని చేస్తున్నారని ఇది సరైనది కాదని తెలిపారు. అనంతరం యండపల్లి, కె.రామాపురం పిహెచ్సిలలో ఆశాలు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ముం


డిఎంహెచ్ఒ కొండయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు

తాజ్, రమాదేవి, సత్యవాణి, సిఐటియు నాయకులు మాధవయ్య పాల్గొన్నారు.

రామసముద్రం : ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలని రామసముద్రం మెడికల్ ఆఫీసర్ లీలాకు వినతిపత్రం అందించారు. ఒప్పంద జిఒలు వెంటనే ఇవ్వాలని కోరారు. **మదనపల్లె అర్బన్ :** ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు, బొమ్మనచెరువు పిహెచ్సిలోని మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రం అందజేశారు. ఆశా యూనియన్ అధ్యక్షులు కె.పోశమ్మ, ప్రధాన కార్యదర్శి కె.రసలక్ష్మి మాట్లాడుతూ ఆశావర్కర్ల వేతనాలు పెంచాలని, 2024 ఫిబ్రవరి 9న ప్రభుత్వం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో ఒప్పందం కుదిరిందన్నారు. జిఒలు, సర్క్యులర్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం/చిన్నమండెం/సంబేపల్లె(రాయచోటి)

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రామాపురం మండలం నీలకంఠరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో పాఠశాలల్లో చదివే విద్యార్థినులపై లైంగిక వేధింపులు ఎక్కువవుతున్నాయని వాటిని ఎదుర్కొనేందుకు ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల సమస్యలు తెలియజేసేందుకు పాఠశాలలు, వసతి గృహాలలో తప్పకుండా ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడితే సంబంధిత వ్యక్తులను ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు. నేలకంఠరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు స్వయంగా పరిశీలించి అన్నం సరిగా ఉడకలేదని, నాణ్యతగా లేదని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుంచి ప్రతి పాఠశాల, గృహాలను తరచూ విజిట్ చేస్తానని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మంత్రి రాంప్రసాద్రెడ్డి అన్నారు. తూర్పుపల్లె ఎంపీ యుపి స్కూల్ను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి


సంబేపల్లె : గురుకుల పాఠశాల విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని తెలిపారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, బుక్స్ యూనిఫాం, అందించారా లేదా అనే విషయాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులను కన్నబిడ్డలా చూసుకోవాలి : ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినిలను కన్నబిడ్డల్లా చూసుకోవాల మంత్రి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థినులకు గుణాత్మకమైన విద్యను బోధించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థినులను మన కన్న బిడ్డల్లా చూసుకుని వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసే బాధ్యత గురుకుల పాఠశాల యాజమాన్యంపై ఉందన్నారు. టాయిలెట్లు, బాత్రూంలు, చుట్టు పరిసర ప్రాంతాలు పారిశుధ్య లోపం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలను గదులను పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడారు. వంటశాలను పరిశీలించి ఆహార పదార్థాల మెనూపై వంట ఏజెన్సీలతో వివరాలు తెలుసుకున్నారు.

కడప 'ఉక్కు'పై తక్షణం చర్యలు చేపట్టాలి

- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి-కడప

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై తక్షణం చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.షర్మిల పేర్కొన్నారు. మంగళవారం ఆమె కడప జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ వైఎస్ఆర్ ఆశయం, సంకల్పమని పేర్కొన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఆంధ్రుల హక్కు అని పేర్కొన్నారు. ఎన్ని పార్టీలు అధికారంలోకి వచ్చినా శంకుస్థాపనలకే ఉక్కు పరిశ్రమ పరిమితమైందని పేర్కొన్నారు. వెంటనే ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ ఉద్యమాలు, పోరాటాలు పెద్ద ఎత్తున సాగిస్తుందని హెచ్చరించారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు యుపిఎ ప్రభుత్వం నిబంధనలు రూపొందించిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ డిమాండ్ను విస్మరించడంతో ఆ తర్వాత వచ్చిన రాష్ట్ర ప్రభుత్వాలు పెదవి విప్పాయన్నారు. దశాబ్ద కాలంగా ఉక్కు కర్మాగారం పురోగతిని బిజెపితోపాటు టిడిపి, వైసిపి స్తంభింపజేశాయని తెలిపారు. 2014లో అధికారంలో వచ్చిన చంద్రబాబు నాలుగున్నర ఏళ్లపాటు కడప ఉక్కు పరిశ్రమ గురించి పట్టించుకోలేదన్నారు. ఎన్నికలకు 6 నెలల ముందు 2018లో మళ్లీ శంకుస్థాపన చేశారన్నారు. అధికారంలో వచ్చిన జగన్ 2019 డిసెంబర్ 23న స్థలాన్ని మార్చి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. తిరిగి 2023 ఫిబ్రవరి 15న అదే స్టీల్ ప్లాంట్కి జగన్ మళ్లీ శంకుస్థాపన చేశారని, ఇలా స్టీల్ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమైందని వాపోయారు. వెంటనే స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్ఖాన్, జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, మధురెడ్డి, ధ్రువకుమార్ రెడ్డి, పఠాన్ మహమ్మద్ అలీఖాన్, రషీద్, సయ్యద్ సలావుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కురువంకలో అక్రమ నిర్మాణాలు తొలగించండి : ఎమ్మెల్యే


కురువంకలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ సరిహద్దుల్లోని కురవంకలో చెత్తవేయడం వల్ల వర్షం పడిన సమయంలో నీరు వెళ్లే మార్గం లేక ఆ నీరు ఇండ్లలోకి చేరుతున్నాయని ఎమ్మెల్యే షాజహాన్బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పాలని సిబ్బందికి ఆదేశించారు. పారిశుధ్య విభాగంలో బాధ్యతారహితంగా వ్యవహరించే మున్సిపాలిటీ, గామ పంచాయతీ సిబ్బంది వైఖరిని ఖండిస్తూ విధులు సక్రమంగా నిర్వహించని వారిపై సస్పెన్షన్ వేటు వేస్తామని హెచ్చరించారు. గతంలో సమస్య తమ దృష్టి వచ్చిందని, తిరిగి మూడోసారి సమస్య పునరావృతం కావడంపై అసహనం వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు సమన్వయం చేసుకొని ఎక్కడెక్కడ అక్రమణలు ఉన్నాయో వాటిని పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. సమస్య ఒక్కసారి వస్తే పరిష్కారం కావాలని, తిరిగి మళ్ళీ మళ్ళీ అదే సమస్య తలెత్త కూడదన్నారు. అ ప్రాంతంలో ఒక రోడ్డు అవసరం ఉందని, దానిని వెంటనే వేయాలని ఆదేశాలు ఇచ్చారు. సమస్యలపై సకాలంలో అధికారులు స్పందించాలని,స్థానికంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపైన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఖాజాబీ, మున్సిపల్, సచివాలయం సిబ్బంది, నాయకులు రంగస్వామి నాయుడు, బొమ్మిశెట్టి పురుషోత్తం, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, మార్వారి నాగార్జున బాబు, రైస్ మిల్ శశి కుమార్, కంచర్ల మల్లికార్జున నాయుడు, జెసిబి వేణు, దుర్గా ప్రసాద్, అప్పినపల్లె భాస్కరాచారి, రెడ్డి రాయల్స్, మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి, రాధమ్మ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


చెకుముకి పోస్టర్ను ఆవిష్కరిస్తున్న డిఇఒ, జెవివి నాయకులు

శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి- రాయచోటి

విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్ రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక వారి చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పోస్టర్ను మంగళవారం ఉదయం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందిస్తుందని, సైన్స్ పట్ల అభిరుచిని కలిగిస్తుందని అన్నారు. 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు అర్హులన్నారు. ఈ పోటీ పరీక్షలలో పాల్గొనేటట్లు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. సమాజంలో శాస్త్రీయ భావాలు పెంపొందేటట్లు జన విజ్ఞాన వేదిక వారు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి ప్రకాష్రెడ్డి మాట్లాడుతూ ఈ టాలెంట్ పరీక్షలు నాలుగు స్థాయిలలో నిర్వహిస్తామన్నారు. పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25న, మండల స్థాయిలో అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబర్ 27న, రాష్ట్రస్థాయిలో నవంబర్ 9, 10 తేదీలలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడి ప్రసాద్ బాబు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, డైట్ అధ్యాపకులు వై.సీ రెడ్డప్ప రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శివయ్య, జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, రవీంద్రనాథ్ రెడ్డి, శివారెడ్డి, రామయ్య, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలంటూ మదనపల్లె సర్వజన బోధనసుపత్రిలో పనిచేస్తున్న జిడిఎలు ఆఫీస్ అసిస్టెంట్లు, ఒటి అసిస్టెంట్లు ధర్నా చేశారు. 18 ఏళ్లుగా తాము ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రూ.13 వేల వేతనంతో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. 26 మంది పనిచేస్తుండగా కొంత మందికి 13 నెలలుగా జీతాలు లేవని, మరి కొంతమందికి ఎనిమిది నెలలుగా జీతాలు అందకపోవడంతో మా పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, స్థానిక ఎమ్మెల్యే, డిసిహెచ్ఎస్, సబ్ కలెక్టర్లకు పలుమార్లు విన్నవించినా తమకు జీతాలు ఇవ్వకపోగా పైపెచ్చు ఉన్నత స్థాయి అధికారులు తమను అవహేళనగా మాట్లాడడంతో పాటు పనిభారాన్ని పెంచుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తమ బాధను అర్థం చేసుకొని వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు తోపు కృష్ణప్ప కాంట్రాక్టు కార్మికులకు మద్దతు తెలియజేస్తూ అరకొర జీతంతో పని చేస్తున్నప్పటికీ కార్మికులను ఇంతలా వేధింపులకు గురి చేయడం సబబు కాదన్నారు. కొంత మందికి 13 నెలలు, మరికొంత మందికి 8 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు పస్తులున్న పరిస్థితి నెలకొందన్నారు. పిల్లలకు ఫీజులు కట్టలేక, స్కూలుకు పంపలేక, డ్యూటీలు అయిపోయిన తర్వాత టిఫిన్ సెంటర్లలో పనిచేసుకొని కుటుంబాన్ని నెట్టుకు రావాల్సిన పరిస్థితి కార్మికులకు తలెత్తిందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి జీతాలు లేక అల్లాడుతున్న జిడిఎ, ఆఫీస్ అసిస్టెంట్, ఒటి అసిస్టెంట్లకు వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి ధర్నా కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వ అధికారులను హెచ్చరించారు. అనంతరం ఇన్ఛార్జి సూపరింటెండెంట్కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు అమరావతి, పెద్దయ్య, ఉమా, లోకేష్, అహ్మద్, తులసి, ప్రభావతి, మృదుల, ప్రభావతి, హరి, పెద్దన్న పాల్గొన్నారు.

కమ్యూనిటీ రేడియోపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కమ్యూనిటీ రేడియో 90.8 వారు రేడియో జాకీపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు.తిరుపతి రెడ్ ఎఫ్ఎం వారి సహకారంతో కళాశాల ప్రాంగణంలో నిర్వహించామన్నారు. ఈ కార్యకమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి, నెల్లూరు రెడ్ ఎఫ్ఎం రీజినల్ హెడ్ శ్రీధర్ మాట్లాడుతూ రేడియో జాకీయింగ్ ఇటీవలి కాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన కెరీర్ ఎంపికలలో ఒకటిగా నిలిచిందని, ప్రముఖ రేడియో జాకీలు సమాజంలో సెలబ్రిటీ హోదాను అనుభవి స్తున్నారనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఒక్క రేడియో జాకీల వల్లే ఒక ప్రాంతం యొక్క ప్రజాదరణను అంచనా వేయవచ్చని తెలిపారు. ప్రస్తుత కాలంలో రేడియో జాకీ కెరీర్ యువతకు ఉత్తేజకరమైన కెరీర్ ఎంపికగా మారిందన్నారు. రేడియో జాకీ యొక్క వృత్తి అన్ని వర్గాల ప్రజలను ఆకర్షిస్తుందని, ఈ రంగంలో ఎదుగుదల మరియు విజయం సాధించాలంటే ప్రతిభతో పాటు పట్టుదల చాలా అవసరమని పేర్కొన్నారు. రేడియో జాకీకి వ్యక్తులతో కనెక్ట్ అవ్వడానికి, పరస్పర చర్య చేయడానికి అభిరుచి ఉండాలన్నారు. శ్రోతలకు 'ముఖాముఖి' అనుభూతిని అందించడానికి వారి సంభాషణ శైలిని కలిగి ఉండాలన్నారు. ఈ వృత్తి యొక్క అందం ఏమిటంటే, ప్రజలు మిమ్మల్ని మీ పేరు, ముఖం ద్వారా కాకుండా మీ వాయిస్ ద్వారా గుర్తిస్తారు అని, మీ వాయిస్ని జనాలు అంగీకరిస్తే మీరు ఆటోమేటిక్గా ఇంటి పేరు అవుతారని పేర్కొన్నారు. రేడియో జాకీలు ముఖ్యంగా అనౌన్సర్, సంగీతాన్ని ప్లే చేయడం, మాట్లాడటం, వివిధ సామాజిక మరియు రాజకీయ సమస్యలను పరిష్కరించడం, స్పోర్ట్స్ టాక్, న్యూస్ రీడర్, ఆన్-ఎయిర్ పర్సనాలిటీలు, ప్రొడక్షన్ డైరెక్టర్, స్టేషన్ మేనేజర్ మరియు మరెన్నో ఈ రేడియో జాకీ చేయగలిగే పాత్రలని పేర్కొన్నారు. కార్యకమంలో ఇంటెర్నేషన్ రిలేషన్స్ సీనియర్ మేనేజర్ విజయ లక్ష్మి, ప్రోగ్రాం మేనేజర్ నరసింహాచారి, డాక్టర్ సతీష్, కో-ఆర్డినేటర్ డాక్టర్ అరవిందరాజ్, డాక్టర్ బి.రాజేష్ కుమార్, పవన్ పాల్గొన్నారు.

చౌకదుకాణాల్లో సబ్ కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చౌక దుకాణాల నిర్వహకులు రేషన్ సరుకులను ప్రజలకు సక్రమంగా అందించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. మదనపల్లి పట్టణంలోని 36, 37 చౌక దుకాణాలను మంగళవారం సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులో అన్ని రకాల నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచి నిర్దేశిత వ్యవధిలోగా సరఫరా చేయాలని సూచించారు. డీలర్లు చౌక దుకాణాలలో మొక్కుబడిగా కాకుండా సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని తెలిపారు. 36, 37 చౌక దుకాణాలలో డీలర్లు అందుబాటులో ఉండటం చూసి సబ్ కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల తూకాల్లో తేడాలు రాకుండా చూడాలని గోడౌన్ డిటి రెడ్డప్పను ఆదేశించారు. తూకల్లో తేడాలు వస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ డిటిని హెచ్చరించారు.

రూ.5 కోట్లకు వ్యాపారి ఐపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చిత్తూరు పట్టణానికి చెందిన ప్రొవిజినల్ స్టోర్ వ్యాపారి డి.జయశంకర్శెట్టి రూ.5 కోట్లకు మదనపల్లె సబ్ కోర్టులో ఐపి దాఖలు చేశాడు. వరుస ఐపిలతో మదనపల్లిలోని వడ్డీ వ్యాపారస్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు పట్టణం, వేపమాను వీధిలో కాపురం ఉంటున్న జయశంకర్ శెట్టి స్థానికంగా ఉన్న 78 మంది వ్యాపారుల వద్ద రూ.5 కోట్ల వరకు అప్పులు చేశాడు. వ్యాపారాల్లో నష్టాలు రావడంతో చేసిన అప్పులు చెల్లించలేక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. తనకున్న రూ.3 లక్షల ఆస్తులను కనబరస్తూ మదనపల్లి సబ్ కోర్టులో ఐపి దాఖలు చేసినట్లు బాధితుని తరపు న్యాయవాది సంపత్ మంగళవారం మీడియాకు తెలిపారు.


విజయవాడ వరద బాధితులకు సిద్ధంగా ఉంచిన బ్రెడ్లు

వరద బాధితులకు 2 వేల బ్రెడ్లు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వరద బాధితులకు పట్టణంలోని శేఖర్ స్వీట్స్ యజమానులు పెరుమాళ్ ముత్తుస్వామి, పెరుమాళ్ బాలసుబ్రహ్మణ్యం, పెరుమాళ్ మమత బాసటగా నిలిచారు. తమ సొంత వాహనంలో 2000 బ్రెడ్లు (బన్నుు)లు సరఫరా చేశారు. ఈ వాహనం మంగళవారం విజయవాడ చేరుకుని ప్రభుత్వం ద్వారా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా పెరుమాల్ ముత్తుస్వామి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో కురిసిన అతిభారీ వర్షాలకు కోస్తాలోని పలు జిల్లాల్లో, అనేక గ్రామాలు జలమయమం కావడం బాధాకరమన్నారు. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అక్కడ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. వరద బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముమ్మర సహాయక చర్యలు చేపట్టిందన్నారు. వరదల్లో చిక్కుకున్న వారి ఆకలి తీర్చడానికి తమవంతు సాయంగా బన్నులను చేరవేశామన్నారు. వరద బాధితులకు అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శేఖర్ స్వీట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3 లక్షలు విలువచేసే నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : భారీ వర్షాల ధాటికి ఎపిలో వరదలు సంభవించి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వరద బాధితులకు మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ ఆదర్శంతో తంబళ్లపల్లె తెలుగుదేశం పార్టీ ఆరు మండలాల అధ్యక్షులు, ఇతర నాయకులు మంగళవారం రూ.3 లక్షల విలువ చేసే నిత్యావసరాలు, తినుబం డారాలు పంపించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ సూచనలు మేరకు వరద బాధితులకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నిరంతరం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్య టించి ప్రజలకు భరోసానిస్తున్నారని కొనియాడారు. వారి స్ఫూర్తితో మాజీ ఎమ్మెల్యే శంకర్ నేతృత్వంలో వరద బాధితులకు అండగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. మండలాల అధ్యక్షులు జిట్టా వెంకటరమణ, పాలగిరి సిద్ధా, ఆనంద్ రెడ్డి, నారాయణ స్వామిరెడ్డి, బి.కొత్తకోట టౌన్ అధ్యక్షుడు వెంకట రమణ, మాజీ ఎఎంసి ఛైర్మన్ శ్రీనాథ్ రెడ్డి, నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కుడుం శ్రీనివాసులు, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, రాజంపేట పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షుడు నటరాజ్ నాయక్, క్లస్టర్ వై.జి.రమణ, మాజీ జడ్పిటిసి ఈశ్వరప్ప, క్లస్టర్ చెన్నకృష్ణ, బయ్యారెడ్డి తదితరులు నిత్యవసర సరుకులు పంపంచడానికి సహకారం అందించారు. వీరందరిని మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ అభినందించారు.



విజయవాడ వరద బాధితుల తరలిస్తున్న నిత్యావసర వస్తువులు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : మంత్రి



చిన్నమండెం : టోల్ఫ్రీ నెంబర్ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం/రాయచోటి

జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో గృహ నిర్మాణాలకు సంబంధించి ఫిర్యాదులపై ఫోన్ నెంబర్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇళ్ల నిర్మాణల కార్యక్రమాన్ని చేపడుతుందని తెలిపారు. జిల్లాలో ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలున్నా వెంటనే 8561293086 అనే నెంబర్కు ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలున్న వెంటనే పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో కలెక్టరేట్లోని హౌసింగ్ టిడి కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. హౌసింగ్ లబ్ధిదారులు సిమెంటు, స్టీలు, ఇసుక, తదితర మెటీరియల్కు సంబంధించిన సమస్యలపై వెంటనే కాల్ సెంటర్కి ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లబ్ధిదారులు ఈ నెంబర్కు ఫోన్ చేయవచ్చునన్నారు.

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ : ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా అర్జీదారులకు సత్వర న్యాయం చేకూర్చడం జరుగుతుందని రాంప్రసాద్రెడ్డి అన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోక నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. ఉదయం 6 గంటల నుంచి అర్జీదారులు జిల్లా నలుమూలల నుంచి, ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజాదర్బార్కు వచ్చారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని, రోడ్డు, డ్రెయినేజీ, విద్యుత్ తీగలు కిందికి ఉండడం, రైతులకు ట్రాన్స్ఫార్మర్ల సమస్యలు వంటి వివిధ రకాల సమస్యలతో ప్రజలు తమ దగ్గరికి వచ్చారని పేర్కొన్నారు. సమస్యలన్నీ అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలియజేసి వాటి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బ్యాటరీ వాహనాలను వాడాలి : సమాజంలో రోజురోజుకు వాహనదారుల సంఖ్య ఎక్కువ కావడంతో కాలుష్యం పెరిగిపోతుందని రాంప్రసాద్రెడ్డి అన్నారు. స్థానిక నీలపరి బజాజ్ షోరూంలో నూతన బజాజ్ చేతక్ బైక్ను ప్రారంభించి మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోవడంతో వర్షాలు రాకపోవడం, ప్రజలు వ్యాధులకు గురి కావడం వంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు బ్యాటరీ వాహనాలపై ప్రభుత్వం మక్కువ చూపుతోందన్నారు.


ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డిని కలిసిన వైసిపి ఎంపిటిసిలు

మండలాభివృద్ధికి ఎమ్మెల్యేతో కలిసి పనిచేస్తాం

- వైసిపి ఎంపిటిసిలు

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి మండల అభివృద్ధికి ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డితో కలిసి పనిచేస్తామని కలికిరి మండల వైసిపి ఎంపిటిసి తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కలికిరి మండలం పత్తేగడ పంచాయతీ నగిరిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాలు కప్పి వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్నికలప్పుడు మా గ్రామాలలో మాపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించినందుకు వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత మాపై ఉన్నదని అన్నారు. ఎమ్మెల్యే సహక రించాలని కోరారు. ఎమ్మెల్యేని కలిసిన ఎంపిటిసిలలో భోగేష్, రంజిత, భారతి, షాహీన, రమణ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వాయిదా

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో మంగళవారం నుంచి జరగాల్సిన రెవెన్యూ సదస్సులను వాయిదా పడినట్లు తహశీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. విఆర్‌ఒల బదిలీల కార్యక్రమం ఉండడం వల్ల రెవెన్యూ సదస్సులు వాయిదా పడ్డాయని, బదిలీల అనంతరం తిరిగి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. ఆ గ్రామ రైతులకు, ప్రజలకు తర్వాత సదస్సు జరిగే తేదీలను తెలియజేస్తామని చెప్పారు.

'అన్నమాచార్య' అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



అన్నమాచార్య యూనివర్సిటీలో ఇఇఇ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న పాలెపు సురేష్‌బాబుకు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి వారిచే పిహెచ్‌డి ప్రదానం జరిగిందని కళా శాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌ఎంవి నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆప్టిమల్ ప్లేస్మెంట్ ఆఫ్ పిఎంయుస్ ఇన్ ట్రాన్సిమిషన్ సిస్టమ్ ఫర్ ఓల్టేజ్ స్టెబిలిటీ మానిటరింగ్ అండ్ ఎన్ హాన్సమెంట్ యూసింగ్ ఫ్యాక్ట్స్ డివైజన్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. ప్రొఫెసర్ ఎం.దామోదర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్, ఎస్‌వియుసిఇ, ఎస్‌వి యూనివర్సిటీ ఆధ్వర్యంలో పిహెచ్‌డి చేసినట్లు తెలిపారు. సురేష్ బాబు చేసిన పరిశోధన వల్ల పవర్ సిస్టమ్‌ను ప్రొటెక్ట్ చేయడంతోపాటు సెక్యూరిటీ మెరుగు పరచవచ్చునని తెలిపారు. ట్రాన్సిమిషన్ వ్యవస్థలో ఓల్టేజ్ స్థిరత్వాన్ని పర్య వేక్షించడం వలన విద్యుత్ నాణ్యతను మెరుగు పరిచి లోపాలను వేగంగా గుర్తిం చవచ్చని అన్నారు. ఈ సందర్భంగా అన్న మాచార్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, కళాశాల ఛైర్మన్ డాక్టర్ సి.రామ చంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ప్రో ఛాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలిత, అధ్యాపక బృందం పాలెపు సురేష్‌బాబును అభినందించారు.


సబ్ కలెక్టర్‌కు పూలబొకేను అందజేస్తున్న తల్లెం భరత్

ప్రత్యామ్నాయ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మంగంపేట గ్రామ సమస్యలను పరిష్కరించాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైకోమ్ నదియాదేవిని కలిసి సోమవారం గుంతకల్ రైల్వే బోర్డు మాజీ సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ మంగంపేట కాపుపల్లి దళితవాడ, అరుంధతివాడ గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లబ్ధిదారులకు చేకూరాల్సిన పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీలను త్వరగా మంజూరు చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. సర్వేనెంబర్ 8లో ప్రత్యామ్నాయ శ్మశాన వాటిక స్థలాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మంగంపేటలో ఉన్నటు వంటి వివిధ సమస్యలను కూడా పరిష్కరిం చాలని సబ్ కలెక్టర్ వినతి పత్రం అందించారు.

రేపు తంబళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిపి అనసూయ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. ఈ సమా వేశానికి మండల ఉపాధ్యక్షులు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మట్టి వినాయకులను ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని మదనపల్లె డిఎస్‌పి కొండయ్యానాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో పీస్ కమిటీ కమిటీ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా వినాయక మట్టి ప్రతిమలని పూజించి, పర్యావరణాన్ని కాపాడు కోవాలని కోరారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని, మండపాల నిర్వాహకులు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విద్యుత్ శాఖ నుంచి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని,వివాదాస్పద స్థలాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ వినాయక విగ్రహాలు ప్రతిష్టించకూడదని చెప్పారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని, బలవంతపు విరాళాలు, చందాలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలకు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. భక్తి భావంతో, సాంప్రదాయ బద్ధంగా ప్రతి ఒక్కరూ పండగ జరుపుకోవాలని సూచించారు. లౌడ్ స్పీకర్లు రాత్రి పది గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వినియోగించరాదని చెప్పారు. అసభ్యకరమైన అశ్లీల నృత్యాలు ప్రదర్శించ కూడదని తెలిపారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో సిఐలు చాంద్‌బాషా, రామచంద్ర, రమేష్, కళా వెంకట్రమణ, విజయభారతి సంస్థల అధినేత సేతు, పీస్ కమిటీ సభ్యులు బాలాజీ, ఆనంద్ ప్రముఖ దేవాలయాల ప్రధాన అర్చకులు, ధర్మకర్తలు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కొండయ్యనాయుడు

పక్కా భవనానికి నోచని తపాలా కార్యాలయం

-నేటికీ అద్దె భవనంలోనే కొనసాగింపు

ప్రజాశక్తి-గాలివీడు

దేశంలో అతి పెద్ద తపాలా శాఖ ఏర్పడి ఎన్నో సంవత్సరాలు అవుతున్నా గాలివీడు తపాలాశాఖ నేటికీ పక్కా భవనానికి నోచుకోలేదు. మండలంలో 17 గ్రామాల్లో 50వేలకు పైగా జనాభా నివసిస్తోంది. అన్నమయ్య జిల్లాలో జిల్లా కేంద్రం రాయచోటి తర్వాత అభివృద్ధి చెందిన మండలాలలో గాలివీడు ప్రథమ స్థానంలో ఉంది. మండల కేంద్రంలో ఉన్న తపాల శాఖ నెలకు రూ.7వేలు అద్దె చెల్లిస్తూ అద్దె భవనంలోనే తపాలా సేవలు కొనసాగుతున్నాయి. గాలివీడు పంచాయతీ చెక్క వాండ్లపల్లి వద్ద సర్వే నెంబర్ 961/2లో ఒక ఎకరా 96సెంట్లు తపాలా కార్యాలయం కొరకు బిఎస్‌ఎన్‌ఎల్ శాఖకు కేటాయించి చుట్టూ ప్రహరీ నిర్మించారు. మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పక్కా భవనాలతో ఉంటే తపాలా శాఖ బిఎస్‌ఎన్‌ఎల్ శాఖ మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతోందని మండల ప్రజలు పేర్కొంటున్నారు. కడప జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ ప్రజాశక్తితో మాట్లాడుతూ 2025, ఏప్రిల్ నాటికి రాయచోటి, గాలివీడుకు తపాల శాఖ పక్కా భవనాలు మంజూరు అవుతాయని, ప్రతిపాదనలు కూడా పంపామని తెలిపారు.


అద్దె భవనంలో కొనసాగుతున్న తపాలాశాఖ కార్యాలయం

నేత్ర దానంతో వెలుగులు నింపుదాం

- డాక్టర్ కావ్య గంధ


నేత్రదానంపై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కలికిరి

నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించి చూపులేని వారికి వెలుగులు నింపుదామని మేడిగుడ్డు పిహెచ్‌సి వైద్యులు కావ్య గంధ పేర్కొన్నారు. మండలం లోని మెడికుర్తి పిహెచ్‌సిలో ఘనంగా 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆశాడే సందర్భంగా నేత్రదానంపై అవ గాహన సదస్సు డాక్టర్ కావ్య గంధ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేత్ర దానం ప్రాముఖ్యత పై కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కల్పించి అంధుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. ఆ దిశలో భాగంగా ప్రతీ సంవత్సరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ప్రజల్లో నేత్ర దానంపై అవగాహన కల్పించడం కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ రంగ సేవ సంస్థలు విరి విగా కృషి చేస్తున్నాయని అన్నారు. కంటి చూపు లోపాలకు కారణం పుట్టుకతోనే వచ్చే దృష్టి సమ స్యలు, ప్రమాదాలు, దృష్టి లోపాలు, పౌష్టికాహార లోపాలు కారణాల వల్ల అనేక మంది కంటి చూపు కోల్పోతున్నారని అన్నారు. అలాంటి వారి కళ్ళలో గుడు (కార్నియా) ను అమార్చగలిగితే కంటి చూపు వచ్చే అవకాశం ఉందని అన్నారు. నేత్రదానంపై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయని అన్నారు. అపోహలను, అనుమానాలను పోగొట్టడానికే ఈ నేత్రదాన అవగాహన పక్షోత్సావాలు నిర్వ హిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామని చెప్పారు. నేత్రదానం చేయడానికి వయస్సుతో పరిమితులు లేవని, ఒకటి లేక రెండు కళ్ళు కూడా దానం చేయచ్చునని, తెలిపారు. నేత్రదానం చేస్తున్నట్లు ముందుగా ప్రకటించిన లేక మరణం అనంతరం కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రదానం చేయచ్చునని అన్నారు. బిపి, షుగర్, ఆస్తమా వంటి వ్యాధులతో ఉన్నవారు కూడా నేన్రతదానం చేయచ్చునని, నేత్రదానం చేయాలనుకునే వారు వారి దగ్గర లోని స్వచ్ఛంద సేవా సంస్థలు, ఐ బ్యాంక్‌లకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. నేత్రదానం కుటుంబ వారసత్వంగా అలవాటు చేసుకో వాలని, మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలను దానం చేద్దాం.. అంధత్వంతో భాదపడుచున్న వారికి చూపును ప్రసాధిద్దాం అని, నేత్రదానం పవిత్ర మైన బాధ్యతగా ప్రతి ఒక్కరూ స్వీకరించాలని కోరారు. అనంతరం వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు హేమలత సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, పాల్గొన్నారు.

తల్లీబిడ్డ సంరక్షణ బాధ్యత ఆశాలదే

కలకడ: తల్లీబిడ్డ సంరక్షణ బాధ్యత ఆశా వర్కర్లపై ఉందని కలకడ ఎర్రకోటపల్లి ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మల్లికార్జున జవహర్‌బాబులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ, ఎర్రకోటపల్లి వైద్య కేంద్రాలలో ఆశ వర్కర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గర్భిణులకు నిర్వహించిన వైద్య పరీక్షలు ఎంపిసి కార్డు అన్ని కాలములను పూరించాలని అన్నారు. గర్భిణులు మూడవ మాసం నుంచి కాన్పు అయ్యే వరకు సకాలంలో అన్ని పరీక్షలు చేయించాలని తెలిపారు. కాన్పు సమయంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను వాడుకొని వారిని సురక్షితంగా ప్రభుత్వ కేంద్రాలకు చేర్చాలని, కాన్పు అనంతరం బాలింత సంరక్షణను సంపూర్ణంగా చేయాలని అన్నారు.గత సంవ త్సరంలో సర్వీసులు మిగిలిపోయి ఉంటే ఏప్రిల్ మొదటి వారంలో పూర్తి చేయాలని సూచించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని ఈనెల 17న నిర్వహించడం జరుగు తుందన్నారు. కార్యక్ర మంలో ఎంపిహెచ్‌ఇఒ జి.జయరామయ్య, పిహెచ్‌ఎన్ సుబ్బరత్న, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.వెంక టేశ్వరరావు, బి.రెడ్డమ్మ, ట్రీట్మెంట్ సూపర్ వైజర్ వై.నాగిరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు వాణి. శ్రీలక్ష్మి, భాగ్యమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు రాజాసులోచన, కనకమ్మ, అశ్వినీ, లావణ్య, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** ప్రభుత్వ ఆసుపత్రిలోని గ్రామీణ ప్రాంతాలలోని గర్భవతులకు ప్రసవాలు జరిగే విధంగా ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు కృషి చేయాలని తంబళ్లపల్లి పిహెచ్‌సి గైనకాలజిస్ట్ డాక్టర్ తేజశ్రీ కోరారు. కోసివారిపల్లె పిహెచ్‌సి ఆస్పత్రిలో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆశా కార్యకర్తలు గ్రామాలలో గర్భిణులను గుర్తించిన వెంటనే వారి పేర్లను నమోదు చేసుకొని వారికి నెలవారీ అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రులలో సుఖ ప్రసవం జరిగే విధంగా చొరవ చూపాలని సూచించారు. ప్రతినెల కనీసం 30 ప్రసవాలు జరిగేలా అందరూ సహకరించాలన్నారు. ఇక్కడ హై రిస్క్‌తో కూడుకున్న విషయమయినప్పుడు 108 లో జిల్లా ఆస్పత్రికి తరలించడం జరుగుతుందన్నారు. సమావేశంలో కోసివారిపల్లి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ, హెడ్‌నర్స్ క్లోజి లిటిల్ ఫ్లవర్, సూపర్‌వైజర్ అమరావతి పాల్గొన్నారు.

వరదలపై రాజకీయాలు చేయడం సిగ్గుచేటు : ఆర్‌జె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారీ వర్షాల దాటికి రాష్ట్రంలో సంభవించిన వరదల్లో చిక్కుకున్న గ్రామాల్లో సిఎం చంద్రబాబు సాధారణ పరిస్థితుల్లోకి తీసుకురావడాని కృషి చేస్తుంటే మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బురద రాజకీయాలు చేస్తున్నారని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 123 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విజయవాడలో ఒకే రోజు 27 సెంటీమీటర్ల వర్షం కురిసిందని అన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో సుమారు రెండు లక్షల 60 వేల మందికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని, ఈ స్థితిలో సిఎం చంద్రబాబు నాయుడు స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితి చక్కదిద్దడానికి చర్యలు చేపట్టారని కొనియాడారు. అసలు బుడమేరుకు గేట్లు వున్నాయనే సంగతి స్థానిక ప్రజలకే తెలియదు కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రమే తెలుసునని అన్నారు. చంద్రబాబు ఇంటి కోసం బుడమేరు గేట్లు మూసి వేశారని చెప్పడం అవగాహన రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు హెలికాప్టర్లు తెప్పించి సహాయక చర్యలు చేపట్టడం, నిరాశ్రయులైన వారికి ఆహారం అందించడం, రెండు రోజులలోనే సాధారణ స్థితికి చేరుకునే విధంగా చేయడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. మరో వైపు జగన్మోహన్ రెడ్డి బురద రాజకీయలు ఓ వైపు, రాజధాని అమరావతిపైన విషం చిమ్ముతూ అమ రావతి మునిగిపోయింది, హైకోర్టు నీట మునిగిపోయిందని అసత్య ప్రచారం చేయడం దారుణ మన్నారు. ఇప్పటికైనా రాజకీయలు మాని ప్రజలకు సాయం చేయడానికి వైసిపి ముందుకు రావాలని అన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌జె వెంకటేష్

ఆర్‌టిసి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌టిసి డిపో నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆర్‌టిసి డిపో సూపరిండెంట్ రాణి ప్రమీలపై చర్యలు తీసుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ మౌలా డిమాండ్ చేశారు. మంగళవారం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిపోలో సమా వేశమై సూపరిండెంట్ రాణి ప్రమీల వైఖరి పై సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా డిపో సెక్రటరీ మౌలా మాట్లాడుతూ సూపరింటెండెంట్ ఎంతో కాలంగా ఆర్‌టిసి కార్మికులపై నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తూ వేదనలకు గురి చేస్తున్నాని ఆరోపించారు. మంగళవారం కండక్టర్ నాగరాజాచారి, డ్రైవర్ విశ్వనాథ్‌లు కడప-తిరుపతి సర్వీసుకు వెళ్లగా తిరుపతి నుంచి కడపకు తిరుగు ప్రయాణంలో బస్టాండ్ వద్ద కండక్టర్‌ను మరొక బస్సు ఢీకొని గాయా లపాలైతే అతనికి రుయా ఆసుపత్రిలో చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. మెరుగైన చికిత్స కొరకు డైరెక్టింగ్ లెటర్ కోసం సూపరింటెండెంట్ రాణి ప్రమీలను సంప్రదిస్తే లెటర్ ఇవ్వకపోగా అహంకారపూరితంగా ప్రవర్తిం చడం ఆమె నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. గత కొన్ని సంవత్స రాలుగా ఆమెపై అనేక ఫిర్యాదులు ఉన్నప్పటికీ కార్యాలయ సిబ్బంది కూడా ఆమెకే వత్తాసు పలుకుతూ కార్మికులను వేదిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి సూపరిండెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో నాయకులు చలపతి, సుబ్బయ్య, వల్లి, సుధాకర్, శీను, నాయక్, షేక్‌షా పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం కురవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనచేతన సంస్థ ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్ ఏర్పాటు చేసి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలకు సంపూర్ణ అవగాహన కలిగించి, అమాయకులు వ్యాధి బారిన పడకుండా చూడాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల చైతన్యం కలిగించాలని, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు జనచేతన సంస్థకృషిని ప్రశంసించారు. ఎయిడ్స్ వ్యాధి పై ఏవైనా సందేహాలుంటే 1097 టోల్‌ఫ్రీ నెంబరును సంప్రదించాలని సంస్థ సభ్యులు సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఖాజాబీ, టిడిపి నాయకులు జంగాల వెంకటరమణ, రైస్ మిల్ శశికుమార్, జెసిబి వేణు, రాగినేని రఘుపతి నాయుడు, రెడ్డి, జనచేతన సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పీలేరు : పీలేరులో దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, ఎంఆర్‌పి ఎస్, ఎంఎస్‌పి నాయకులు పీలేరు తహశీల్దార్ భీమేశ్వర్‌రావును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో దళితులకు భూ సమస్యలు, ఇండ్ల సమస్యలు అధికంగా ఉన్నాయని, గ్రామాల్లో శ్మశాన వాటికలు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని, అరాకొర మౌలిక వసతులతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ అర్హతుండి నిజంగా లబ్ధి పొందని వారు, భూ సమస్యలున్న వారికి తగిన రికార్డులు, ఆధారాలుంటే తమ దృష్టికి తీసుకువస్తే, తమ సిబ్బందితో పరిశీలించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా అర్హులైన వారు ప్రభుత్వ గృహాలకు నోచుకోకుంటే ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం వారిని అర్హుల జాబితాలో చేర్చి తగు న్యాయం చేస్తామన్నారు. అనంతరం తహశీల్దార్‌ను దుశ్శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు బండ్లవంక పివి రమణ, తంగేళ్ల రమణ, పీలేరుఅధ్యక్షులు గంటపార చరణ్ కుమార్, ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి గోపి దాల నరసింహులు, విహెచ్‌పి నాయకులు భాస్కర, గండికోట రెడ్డి కుమార్ పాల్గొన్నారు.

రోజూ ఆర్‌టిసి ఆదాయం రూ.6.50 కోట్లు

ప్రజాశక్తి-పీలేరు : కడప జోన్ పరిధిలో ఆర్టీసీకి రూ.6.50 కోట్లు ఆదాయం అందుతోందని ఆర్‌టిసి కడప జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పీలేరు డిపో పరిధిలోని పీలేరు, కలకడ ఆర్‌టిసి బస్టాండ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జోన్ పరిధిలోని 6 జిల్లాల్లో 52 ఆర్‌టిసి డిపోలున్నాయని వాటిలో రోజుకు 4,415 బస్సు సర్వీసులు నడుస్తున్నాయని, ఇందులో 18 వేల మంది ఉద్యోగులు పనిచేస్తూ 15.67 లక్షల కిలోమీటర్లు తిరు గుతూ రోజుకు రూ.6.50 కోట్లు ఆదాయం సమకూరుస్తున్నారని తెలిపారు. అనంతరం స్థానిక ఆర్‌టిసి బస్టాండు పరిధిలోని క్యాంటీన్, వ్యాపార సముదాయాలను, ఆర్‌టిసి ప్రాంగణ పరిసరాలను పరిశీలించారు. పీలేరు, కలకడ ఆర్‌టిసి బస్టాండ్లలో నూతన మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిఎం బండ్లకుమార్, బిఎస్‌ఎం బాబు నాయక్, ఎడిసిలు కె.ఎన్.రెడ్డి, పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ బాలాజీ

మెరుగైన వసతులు కల్పించండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పిటిఎం మండల కేంద్రంలోని ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహాన్ని ఎంపిడిఒ బాలాజీ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను వంటగది, మౌళిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. హాస్టల్లో 30 మందికిగాను 22 మంది విద్యార్థులు హాజరవటాన్ని గమనించారు. విద్యార్థులు ఆసక్తితో శ్రద్ధగా చద వాలని, మంచిక్రమశిక్షణ, నడవడికతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని సూచించారు. హాస్టల్లో భోజన నాణ్యతలో వసతి సౌకర్యాలలో ఏవైనా లోపాలు ఉంటే తమకు తెలియజేయాలని విద్యార్థు లను కోరారు. వార్డెన్లు హాస్టల్ విద్యా ర్థులను తమ సొంత పిల్లలు లాగా చూసుకోవాలన్నారు నాణ్య మైన భోజనం వడ్డించి వారి శారీరక ఎదుగుదలకు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్ర మంలో వసతిగృహం సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రపంచం గర్వించదగ్గ మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు పీలేరులో తగిన స్థలం కేటాయించాలని తారక రామారావు విజ్ఞాన కళాక్షేత్రం, పీలేరు నియోజకవర్గ టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులునఫీస్ కోరారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డిని కలసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీలేరు మాజీ ఉప సర్పంచ్ మహమ్మద్ పీర్, ఫర్హాత్, ఇర్షాద్ పాల్గొన్నారు.

నూతన జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి-రాయచోటి

కొత్తపేట నందు నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లా డుతూ శరీర దారుణ్యానికి జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అనుకూలాన్ని బట్టి జిమ్ చేసినట్లయితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా జిమ్ నిర్వాహకులు మంత్రిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

నీట్ పీజీ ఆల్ ఇండియా స్థాయిలో మెరిసిన ఆణిముత్యం

ప్రజాశక్తి-రాయచోటి


డాక్టర్ సాయి చందన

రాయచోటి పట్టణానికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె వేమిరెడ్డి సాయిచందన నీట్ పీజీ ఆల్ ఇండియా స్థాయిలో 735వ ర్యాంకు సాధించి రాయచోటి పట్టణం ఆణిముత్యంలా మెరిసింది. ఇటీవలే విడుదలైన నీట్ ఫలితాలలో ఆమె 735 ర్యాంకును సాధించింది. డాక్టర్ సాయి చందన పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించింది.అప్పట్లో ఆమెను శ్రీహరికోట ఇస్రో శాస్త్రవేత్తలు ఆమెను అభినందిస్తూ బెస్ట్ అవార్డు ఇవ్వడం అందించారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో కూడా రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించింది.నీట్ యూజీ ఫలితాలలో ఆల్ ఇండియా స్థాయిలో 127 వ ర్యాంక్ రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంకును సాధించింది. ఆ తర్వాత బెంగళూరు సంజన్స్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తి చేసి అక్కడ ఉత్తమ ఫలితాలను సాధించింది. అనంతరం జరిగిన నీట్ పీజీ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 735 ర్యాంక్ సాధించింది ఆల్ ఇండియా స్థాయిలో తమ కుమార్తె ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల సాయి చందన తల్లిదండ్రులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, లతలు ఆనంద వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంక్ సాధించిన డాక్టర్ సాయి చందన మాట్లాడుతూ నా తల్లిదండ్రులు గురువుల ప్రోత్సాహంతో ర్యాంకులు సాధించడానికి కారణ మన్నారు. జనరల్ మెడిసిన్ ఎండి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే తమ లక్ష్యం అని ఆమె తెలిపారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి - బి.కొత్తకోట


మహేష్ (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన బి.కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. సిఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని స్థానిక పిటియం రోడ్, ఇందిరమ్మ కాలనీ సమీపంలో మంగళవారం వేకువజామున సిమెంటు లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొటినట్లు తెలిపారు.ఈ ప్రమాదంలో పీలేరు నియోజకవర్గం, బెస్తపల్లికి చెందిన శ్రీవాసులు కుమారుడు మహేష్(25) మృతి చెందాడని తెలిపారు. మృతుడి సోదరి పిటియం మండలం సొన్ను వారిపల్లిలో నివాసం ఉంటుందని, మృతుడు స్థానిక ఇందిరమ్మ కాలనిలో ఇల్లు అద్దెకు తీసుకుని రోజు వారీ కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడని తెలిపారు. సోమవారం రాత్రి ఓ కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయా ణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెంది నట్లు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కాండ్లమడుగు క్రాస్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మదనపల్లి చంద్ర కాలనీకి చెందిన సురేంద్ర(40) మృతి చెందగా,మరో వ్యక్తి నాగరాజు(40) తీవ్రంగా గాయపడ్డాడు.సొంతపని నిమిత్తం గట్టుకు వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వీరి బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గాయపడ్డ వ్యక్తిని 108 సిబ్బంది పైలెట్ రాజు, ఇఎన్‌టి ఉమాశ్రీ 108 నందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మహిళపై దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణయ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...తవళం పంచాయతీ నాయనవారిపల్లెకు చెందిన హేమావతి ఈనెల 1వ తేదీన తన పశువులను తన చేను వద్ద కట్టేసి ఇంటికి వచ్చిందన్నారు. అదే సమయంలో మహిళకు చెందిన ఆవు విడిపించుకుని బత్తల వెంకట రమణకు చెందిన మామిడి తోపులోకి వెళ్ళిందన్నారు. ఈ విషయమై బత్తల వెంకటరమణ మహిళ ఇంటి వద్దకు వచ్చి అసభ్య పదజాలాలతో దుర్భాషలాడుతూ అవమానపరిచారన్నారు. మహిళ ఫిర్యాదు చేయగా బత్తల వెంకటరమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణయ్య తెలిపారు.